సాక్షి
ఖమ్మం
సోమవారం । 10 । జూలై । 2023



సమస్తం ట్యాబ్‌లోనే..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డేటా, ఇతర సమాచారం అప్‌లోడ్ చేసేందుకు అన్ని స్కూళ్లకు ట్యాబ్‌లు ఇవ్వనున్నారు. 8లో



ఠారెత్తిస్తున్న టమాట

కూరగాయల ధరలు నానాటికీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా టమాట కిలో రూ.100కు పైగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. 10లో

గరిష్టం / కనిష్టం
35° / 26°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి ఉషూ టోర్నీలో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: నిజామాబాద్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఉషూ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులకు మూడు పతకాలు లభించాయి. కైన్వాగష్ ఈవెంట్‌లో రుత్విక్‌కు తృతీయ స్థానంలో కాంస్య పతకం, చాన్‌క్వాన్ ఈవెంట్‌లో స్వర్ణపతకం, తల్జిక్వాన్ ఈవెంట్‌లో జీ.సాత్విక్‌కు రజత పతకాలు లభించాయి. జిల్లా క్రీడాకారులను డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి పి.పరిపూర్ణాచారి అభినందించారు.

వేతన సవరణ సంఘాన్ని నియమించండి

- టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి



మాట్లాడుతున్న నాగిరెడ్డి

ఖమ్మం సహకారనగర్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ సంఘాన్ని తక్షణమే నియమించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. 317 జీవో ద్వారా బదిలీ అయిన స్పౌజ్ బదిలీలన్నింటినీ చేపట్టాలని కోరారు. అనంతరం స్కావెంజర్ల నియామకంతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి నివేదిక ప్రవేశపెట్టారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వెంకటేశ్వరరావు, ఎస్.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం అర్చకుడికి జ్యోతిష్యబ్రహ్మ అవార్డు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి ఆలయ అర్చకులు దాములూరి కృష్ణశర్మకు జ్యోతిష్యబ్రహ్మ అవార్డు దక్కింది. గుంటూరు జిల్లా ఉండవల్లిలో ఆదివారం నిర్వహించిన శ్రీ మహా మృత్యుంజయ జప విశ్వశాంతి హోమం సందర్భంగా కృష్ణశర్మకు జపయజ్ఞ సమితి నిర్వాహకులు నాగేశ్వరం రాఘవేంద్ర శర్మ ఈ అవార్డును ప్రదానం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో శైవాగమ ప్రవరలో ఉత్తీర్ణుడై 25 ఏళ్లుగా అనేక జ్యోతిష్య పరిహారాలు చేస్తున్న కృష్ణశర్మకు ఈ అవార్డు దక్కటం పట్ల అర్చకులు అభినందించారు.

అడుగంటిన జలాలు

- జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువుల్లో తగ్గుతున్న నీటిమట్టం
- ముందుకు 'సాగే'దెలా అని రైతుల్లో ఆందోళన
- వరుణుడి కరుణ కోసం ఎదురుచూపులు
- 25 శాతం కూడా నీరు చేరని 728 చెరువులు



నీరు లేని నేలకొండపల్లి కట్టలమ్మ చెరువు

వానాకాలం పంటలు సాగు చేయాల్సిన సమయంలో జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు వట్టిపోతున్నాయి. రిజర్వాయర్లలో నీటిమట్టం తగ్గుతుండగా.. జిల్లాలో ఉన్న మొత్తం 983 చెరువులకు గాను 728 చెరువులు 25 శాతం కూడా నిండలేదు. ఈ పరిస్థితుల్లో వానాకాలం సాగుపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో అత్యధిక శాతం ఆయకట్టు సాగుకు ప్రధాన నీటి వనరుగా ఉన్న పాలేరు రిజర్వాయర్ గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండిపోతోంది. ఈ క్రమంలో నాగార్జున సాగర్ పరిధిలోని ఆయకట్టు సాగు కూడా ప్రశ్నార్థకంగానే మారింది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

జల్లులతోనే సరి..

జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా భారీ వర్షాలు కురవలేదు. కేవలం జల్లులతోనే సరిపోతోంది. దీంతో పూర్తిస్థాయిలో భూమి కూడా తడవని పరిస్థితి ఉంది. కనీసం 60 మి.మీ. వర్షపాతం నమోదైతేనే మెట్ట పంటల సాగుకైనా అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. అయితే ఆ మాత్రం వర్షం కూడా గత నెల రోజులుగా కురవకపోవడంతో రైతుల్లో నైరాశ్యం నెలకొంది. జూన్‌లో 105.2 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. కేవలం 49.5 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. జూలైలోనూ మబ్బులు పట్టినా.. జల్లులు మాత్రమే కురుస్తున్నాయి. పట్టుమని పదినిముషాల పాటు వర్షం కురవడం లేదని రైతులు వాపోతున్నారు. గత ఏడాది జూలైలో మాత్రం వర్షాలు దంచికొట్టాయి. జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులన్నీ మత్తడి పోశాయి. ఈసారి మాత్రం అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. వర్షాలు పడకపోవడంతో చెరువులు, రిజర్వాయర్లు అడుగంటుతున్నాయి. మరో వారం రోజులపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు మాత్రమే కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతుండటంతో పూర్తిస్థాయిలో రిజర్వాయర్లు, చెరువులు నిండటం అనుమానమే. ఈనెల, వచ్చేనెల వర్షాలు కురిస్తేనే ఇవి నిండే అవకాశం ఉంది.

తగ్గుతున్న నీటిమట్టం

జిల్లాలోని ప్రధాన రిజర్వాయర్లలో నీటినిల్వలు తగ్గుతున్నాయి. ముఖ్యంగా నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలో 2.54 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే ఈసారి పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీరు తగ్గుతోంది. వర్షాభావ పరిస్థితులతో ఎగువ నుంచి నీరు విడుదల కాకపోవడంతో పాలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గుతున్నాయి. ఈ రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం 23 అడుగులు కాగా.. ప్రస్తుతం 12.7 అడుగుల మేర మాత్రమే నీరుంది. మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుగా ఉన్న వైరా రిజర్వాయర్‌లోనూ నీరు తగ్గుతోంది. ఇక్కడ నీటి నిల్వ సామర్థ్యం 18.3 అడుగులు కాగా.. ప్రస్తుతం 14.07 అడుగులు మాత్రమే ఉంది. లంకాసాగర్, బేతుపల్లి ప్రాజెక్టుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఈ రిజర్వాయర్ల పరిధిలోని ఆయకట్టు రైతులు వర్షాల కోసం ఎదురుచూడక తప్పడం లేదు.

కళ తప్పుతున్న చెరువులు

జిల్లాలోని చెరువుల్లో నీరు ఇంకిపోతోంది. వానాకాలంలో వర్షాలు సజావుగా కురవకపోవడంతో చెరువులకు ఈ దుస్థితి వచ్చింది. జిల్లాలో మొత్తం 983 చెరువులు ఉండగా.. వీటిలో 728 చెరువుల్లో 25 శాతం నీరు కూడా చేరలేదు. దీంతో సాగు చేయడమెలా అని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురవకపోయినా.. చెరువుల్లో సరిపడా నీరుంటే పంటల సాగు ప్రారంభించే వాళ్లమని, అయితే చెరువుల్లో నీరు లభ్యత లేకపోవడంతో సాగు కష్టమవుతోందని అంటున్నారు. నేలకొండపల్లిలోని కట్టలమ్మ చెరువు పరిధిలో 250 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువులో నీరు లేకపోవడంతో రైతులు సాగు చేయడం కష్టంగా మారింది. అలాగే కొణిజర్లలోని ఊరచెరువు పరిధిలో 300 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువులోనూ నీరు సరిపడా లేకపోవడంతో రైతులు దుక్కులు దున్ని వదిలేశారు. వర్షాలు కురిసి.. చెరువులు నిండితేనే సాగు ముందుకు పోనుంది. కొన్ని చెరువుల్లో నీరు లేకపోవడంతో తూటికాడ మొలిచింది. ఈ వానాకాలం సీజన్‌లో చెరువులు నిండి జలకళ ఉట్టిపడాల్సి ఉండగా.. ఈ సారి మాత్రం చెరువులన్నీ వెలవెలబోతున్నాయి.

జిల్లాలో మొత్తం చెరువులు	75 శాతం నీరు ఉన్నవి
983	62
25 శాతం లోపు నీరు ఉన్న చెరువులు	**100 శాతం లోపు నీరున్న చెరువులు**
728	15
50 శాతం లోపు నీరు ఉన్నవి	
178	

ప్రాజెక్టుల్లో నీటి నిల్వ సామర్థ్యం, నిల్వ వివరాలు.. (అడుగుల్లో)

ప్రాజెక్టు	సామర్థ్యం	ప్రస్తుత నీటి నిల్వ
పాలేరు రిజర్వాయర్	23	12.07
వైరా రిజర్వాయర్	18.03	14.07
లంకాసాగర్	16	5.09
బేతుపల్లి చెరువు	16	9.06



నీరులేక ఎండిపోయిన సత్తుపల్లి మండలం సదాశివునిపాలెంలోని తుమ్మలచెరువు

బౌద్ధక్షేత్రం అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

బుద్ధవనం ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య



బౌద్ధక్షేత్రాన్ని పరిశీలిస్తున్న మల్లేపల్లి లక్ష్మయ్య తదితరులు

నేలకొండపల్లి : దక్షిణ భారతదేశంలోనే అతి పెద్దదైన నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రం అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని బుద్ధవనం ప్రాజెక్ట్ అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య అన్నారు. బౌద్ధక్షేత్రంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆదివారం ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న రెస్టారెంట్ పనులు రెండు నెలల్లో పూర్తి కావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పర్యాటకులకు అవసరమైన గదులతో పాటు ఇతర సౌకర్యాల కల్పనకు రీ డిజైన్‌తో పనులు చేస్తున్నట్లు తెలిపారు. మరో రూ.26 లక్షలతో ఇతర పనులను చేయించనున్నట్లు చెప్పారు. కలెక్టర్ వీపీ గౌతమ్ బౌద్ధక్షేత్రం అభివృద్ధి పట్ల ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని అభినందించారు. ఆయన వెంట బుద్ధవనం ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాసరెడ్డి, ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ డాక్టర్ శివనాగిరెడ్డి, ముజ్జుగూడెం సర్పంచ్ బ్రహ్మయ్య, సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ ఉన్నారు. అనంతరం బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ లక్ష్మయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ముత్తమాల రమేష్, పి.యోనా, గుంటి మోహన్‌రావు పాల్గొన్నారు.

బౌద్ధ శిల్పాల పరిశీలన



శిల్పాలను పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

ముదిగొండ: ముదిగొండలోని పలు ప్రదేశాల్లో గల పురాతన శిల్పాలను పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమన శివనాగిరెడ్డి ఆదివారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న రెండు శిల్పాలను చూసి అవి ఇటీవల కాలానికి చెందినవేనని చెప్పారు. బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సూచన మేరకు పురాతన శిల్పాలను పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట తెలంగాణ చరిత్ర బృందం కో కన్వీనర్ కట్టా శ్రీనివాసరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, ఎస్‌ఐ నరేష్ ఉన్నారు.

కొనసాగుతున్న గేట్ల మరమ్మతులు



పాలేరు గేట్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కూసుమంచి: పాలేరు పాత కాలువ గేట్ల మరమ్మతుల్లో భాగంగా అధికారులు ఆదివారం పాత గేట్లను తొలగించారు. వాటి స్థానంలో రూ.9 లక్షల వ్యయంతో కొత్తగా తయారుచేయించిన గేట్లను త్వరలో అమర్చనున్నారు. కాగా పాలేరు కాలువ కింద ఇప్పటికే రైతులు వరి నార్లు పోసుకుని, నీటి కోసం ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో గేట్ల మరమ్మతు పనులు చేపడుతుండటంతో సకాలంలో నీళ్లు వస్తాయో, రావోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పాలేరు రిజర్వాయర్ నుంచి ఎడమ కాలువకు నీళ్లు ఇచ్చినా, లేకున్నా ఈ కాలువకు మాత్రం విడుదల చేయాలనే నిబంధన ఉంది. కాగా వీలైనంత త్వరగా గేట్ల మరమ్మతులు పూర్తిచేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

రామాలయానికి బల్లల వితరణ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నిత్యం జరిగే కల్యాణంలో పాల్గొనే భక్తుల కోసం 15 బల్లలు, బాలభోగానికి ఉపయోగించే మేనాను హైదరాబాద్‌కు చెందిన భక్తులు వేణుగోపాల్, అనురాధ దంపతులు ఆదివారం వితరణ చేశారు. వీటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. తొలుత వేణుగోపాల్ దంపతులు ప్రధాన ఆలయంలో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి పండితులు వేదాశీర్వచనం అందజేశారు. కాగా, ఆలయ అధికారులు దాతలకు రశీదు అందించారు.

రామయ్యకు స్వర్ణ పుష్పార్చన



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

భద్రాచలంఅర్బన్: శ్రీసీతారామ చంద్రస్వామివారికి ఆదివారం స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం గోదావరి పుణ్యజలాలతో అంతరాలయంలో మూలవరులకు అభిషేకం గావించారు. 108 బంగారు పుష్పాలతో స్వర్ణ పుష్పార్చన చేశారు. ఆ తర్వాత చిత్రకూట మండపంలో నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, స్వామివారికి కంకణ ధారణ, యజ్ఞోపవీత ధారణ గావించి అమ్మవారికి యోక్త్ర ధారణ గావించారు. ఆదివారం కావడంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు.

బదిలీలు బంగారమాయె!

- 18 నెలలుగా నిరీక్షిస్తున్న ఉపాధ్యాయ దంపతులు
- ఒక్కొక్కరు ఒక్కో ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తూ ఇక్కట్లు
- నిరసన గళం విప్పినా స్పందించని ప్రభుత్వం
- నేడు హైదరాబాద్‌లో స్పౌజ్ బాధితుల ధర్నా



కలెక్టరేట్ వద్ద కుటుంబాలతో నిరసన వ్యక్తం చేస్తున్న స్పౌజ్ బాధితులు (ఫైల్)

ఖమ్మం సహకారనగర్: బదిలీల కోసం 18 నెలలుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ దంపతుల (స్పౌజ్) సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదు. ఎన్నో రకాల ఆందోళనలు, నిరసనలు.. కుటుంబ సభ్యులతో కలిసి ప్రదర్శనలు చేసినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు. ఈ నేపథ్యాన వీరంతా రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సోమవారం ఆవేదన సభను నిర్వహించాలని తలపెట్టారు.

కొంతమంది వచ్చినా..

ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో వివిధ సబ్జెక్టుల్లో 985 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో బదిలీలు జరిగినప్పుడు 140 మంది ఇతర జిల్లాలకు వెళ్లిపోగా.. పరస్పర బదిలీల్లో భాగంగా మరికొంత మంది ఖమ్మం తిరిగి వచ్చారు. జనవరిలో 43 మంది స్కూల్ అసిస్టెంట్లు జిల్లాకు రాగా.. బదిలీ కోటాలో ఇంకా 46 మంది రావాల్సి ఉంది. వీరిలో అధికంగా మహిళా ఉద్యోగులే ఉన్నారు.

ఒక్కొక్కరు ఒక్కో దిక్కున...

భార్యా భర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడంతో బదిలీలతో వారు ఒక్కోచోట విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. దీంతో ఇంట్లో వృద్ధులైన తల్లిదండ్రులు, అత్తమామలు, కొద్దిమందికి చిన్న పిల్లలు, ఇంకొందరి పిల్లలు సుదూర ప్రాంతాల్లో చదువులు.. ఇలా తలా ఒక చోట ఉండాల్సిన పరిస్థితులు దాపురించాయి. వృద్ధాప్యంలో ఉన్న వారికి, తల్లిదండ్రులకు అండగా ఉండాల్సిన సమయంలో ఏదైనా ఆపద వస్తే కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దంపతులు ఒకే జిల్లాలో విధులు నిర్వహించేలా చూస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ అమలుకావడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయ దంపతుల బదిలీలు టెక్నికల్ సమస్యలతో నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారని, బదిలీలు చేపట్టాలని 18 నెలలుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఉపాధ్యాయ దంపతుల బదిలీల ప్రక్రియ మరింత ఆలస్యమైతే తమ జీవితాలు అగమ్యగోచరంగా మారుతాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



2021 ఆఖరులో బదిలీ..

రాష్ట్ర ప్రభుత్వం 317 జీఓ ద్వారా 2021 డిసెంబర్, 2022 జనవరిలో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టగా.. నాడు సీనియారిటీ ప్రాతిపదికన భార్య, భర్త ఒక్కొక్కరు ఒక్కో ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ నాలుగు జిల్లాలకు బదిలీలు చేయగా అక్కడి అధికారులు సమీప ప్రాంతాల పాఠశాలలకు కేటాయించారు. ఈ క్రమంలో స్పౌజ్‌లుగా ఉన్న వారు తమను ఒకే జిల్లాకు కేటాయించాలని కోరుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

317 జీఓ బాధితులను ఆదుకోండి..



గత 18 నెలలుగా కుటుంబాలకు దూరంగా ఉండి ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 317 జీఓ ద్వారా బదిలీలు జరిగినప్పుడు దంపతులను ఒకే జిల్లాలో ఉంచాలని చెప్పినా అలా జరగలేదు. నాటి నుంచి అనేక విధాలుగా ఆందోళనలు చేస్తున్నా ఫలితం లేదు. గత జనవరిలో స్కూల్ అసిస్టెంట్లను బదిలీ చేసినప్పుడు ఒక్క ఖమ్మం జిల్లాలోనే ఖాళీలు లేవని భౌతికశాస్త్రం ఉపాధ్యాయులు ముగ్గురిని భద్రాద్రి జిల్లాలో కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా బదిలీలు చేయాలని కోరుతున్నాం.

– బండారుపల్లి కవిత, జెడ్పీఎస్‌ఎస్, కరకగూడెం

ఆవేదన సభను జయప్రదం చేయండి..



స్పౌజ్ బాధితుల బదిలీలను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నేడు తలపెట్టిన ఆవేదన సభను జయప్రదం చేయాలి. ఈ కార్యక్రమానికి బాధితులంతా హాజరుకావాలి. 18 నెలలుగా దూరంగా ఉంటున్న ఉపాధ్యాయులను బదిలీ చేయాలని కోరుతున్నాం. స్పౌజ్ బాధితుల గోడు రాష్ట్ర ప్రభుత్వానికి చేరేలా ప్రతి ఒక్కరూ సభకు హాజరు కావాలి.

– బి.అప్పు, జిల్లా స్పౌజ్ ఫోరం అధ్యక్షుడు

రెగ్యులర్ ఈడీ ఎప్పుడో ?

ఎస్సీ కార్పొరేషన్‌లో ఖాళీగా సీటు

- ఇన్‌చార్జ్ అధికారికి పూర్తిగా అందని అఫిషియేటింగ్ బాధ్యతలు
- రెండో విడత దళితబంధుకు దరఖాస్తుల స్వీకరణ మరూ
- డిప్యూటేషన్ రద్దు చేసుకొని వెళ్తున్న ఇతర శాఖల సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్ : ప్రభుత్వ పథకాల్లో ప్రతిష్టాత్మకమైన దళితబంధు ద్వారా వందలాది ఎస్సీ కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతున్నాయి. తొలివిడతలో పథకం నిర్వహణలో జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. కలెక్టర్‌తో పాటు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నిరంతర పర్యవేక్షణతో పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన చింతకాని మండలంతో పాటు, నియోజకవర్గానికి 100 యూనిట్ల మంజూరు సకాలంలో పూర్తి చేశారు. అయితే ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్‌కు రెగ్యులర్ ఈడీ లేకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈడీగా పనిచేసిన ఏలూరి శ్రీనివాసరావు రిలీవ్ అయిన తర్వాత ఆ శాఖలో పని చేస్తున్న ఏఈఓకు అఫిషియేటింగ్ ఈడీ బాధ్యతలు ఇచ్చినప్పటికీ అవి పూర్తి స్థాయిలో అందలేదు.

ఖాళీగానే ఈడీ సీటు..

భద్రాద్రి జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఏలూరి శ్రీనివాసరావును గతేడాది జూన్‌లో డిప్యూటేషన్‌పై ఖమ్మం ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా నియమించారు. ఈ ఏడాది జూన్ 1తో ఆయన డిప్యూటేషన్ గడువు ముగియడంతో తిరిగి మాతృశాఖకు పంపించాలని ఎస్సీ కార్పొరేషన్ ఎండీకి ప్రభుత్వం సూచించింది. దీంతో ఏలూరిని రిలీవ్ చేస్తూ అదే శాఖలో ఏఈఓగా పని చేస్తున్న నవీన్‌బాబుకు అఫిషియేటింగ్ ఈడీ బాధ్యతలను అప్పగించారు. గత నెల 26న ఏలూరి రిలీవ్ కాగా, నవీన్‌బాబు బాధ్యతలు తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు ఆ సీటులో కూర్చోలేదు. ఈడీ బాధ్యతల విషయంలో ఆయనకు ఉన్నతాధికారుల నుంచి పూర్తి స్థాయిలో ఆదేశాలు లేకపోవడమే దీనికి కారణమనే చర్చ జరుగుతోంది.

రెండో విడత ప్రారంభమయ్యే వేళ..

దళిత బంధు పథకం మొదటి విడత విజయవంతంగా పూర్తి కావడంతో రెండో విడత ప్రక్రియను కూడా అదే ఉత్సాహంతో పూర్తి చేయాలని ప్రభుత్వం భావించింది. రెండో విడతలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 1100 యూనిట్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను గత నెల 26న విడుదల చేసింది. అయితే ఈ సమయంలోనే ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. రెగ్యులర్ ఈడీ ఉంటే అధికారులను, ఉద్యోగులను సమన్వయం చేస్తూ ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించేవారు. ప్రస్తుతం రెగ్యులర్ ఈడీ లేకపోవడం, అఫిషియేటింగ్ ఈడీ సైతం పూర్తి స్థాయిలో బాధ్యతలు చేపట్టకపోవడంతో పథకం అమలుపై నీలినీడలు అలుముకుంటున్నాయి. ఇక మొదటి విడతకు సంబంధించి సుమారు 300 యూనిట్ల వరకు రెండు, మూడు దఫాల నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమకాలేదని, ఆ ఫైళ్లు జిల్లా అధికారుల వద్ద ఉన్నాయని తెలుస్తోంది.

వెనక్కి వెళ్లిన ఉద్యోగులు..

దళిత బంధు మొదటి విడత నిర్వహణకు ఎస్సీ కార్పొరేషన్‌లో అధికారులు, ఉద్యోగులు తగినంత మంది లేక 15 మందిని ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై తీసుకొచ్చారు. మొదటి విడత పూర్తి కావడంతో ఒక్కొక్కరు తిరిగి వారి శాఖలకు వెళ్లారు. దీంతో ఆ శాఖలో పని చేసే ఉద్యోగుల సంఖ్య తగ్గింది. ప్రస్తుతం ఈఓ, ఏఈఓ, నలుగురు జూనియర్ అసిస్టెంట్‌తో పాటు మరో ఐదుగురు సిబ్బంది మాత్రమే ఉన్నారు. దళితబంధు మొదటి విడతలో కీలకంగా పని చేసిన వారిలో ఎక్కువ మంది ఉద్యోగులు మాతృశాఖకు వెళ్లిపోగా, రెండో విడత పథకం అమలుకు ఇబ్బందులు తప్పవనే చర్చ జరుగుతోంది.

దరఖాస్తులు స్వీకరణ..

దళితబంధు రెండో విడతకు రెండు, మూడు రోజుల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది. ఈసారి మొబైల్ యాప్ ద్వారా ఎంపీడీఓలే లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకొని పథకం లాగిన్‌లో నమోదు చేయనున్నారని సమాచారం. ఎంపిక ప్రక్రియ, యూనిట్ల మంజూరు, యూసీల సేకరణ, నమోదు అన్ని ఆ యాప్ ద్వారానే ఆన్‌లైన్‌లో చేస్తారని, ఇందుకోసం అధికారులకు శిక్షణ ఇచ్చి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తారని తెలుస్తోంది.

ప్రక్రియ కొనసాగుతోంది

ఎస్సీ కార్పొరేషన్‌లో పనులు జరుగుతూనే ఉన్నాయి. దళితబంధు మొదటి విడతకు సంబంధించిన పెండింగ్ పనులు పూర్తి చేస్తున్నాం. ఏలూరి నుంచి అఫిషియేటింగ్ ఈడీగా బాధ్యతలు తీసుకున్నా. కలెక్టర్‌ను కలవాల్సి ఉంది. దళితబంధు రెండో విడతకు గైడ్‌లైన్స్ వచ్చాయి. దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయాల్లో తీసుకోనున్నారు.

– నవీన్‌బాబు, అఫిషియేటింగ్ ఈడీ

క్లుప్తంగా

బాల కార్మికుడికి విముక్తి

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో సీలింగ్ పనులు చేస్తున్న బాల కార్మికుడు కొర్రా చిరు (17)ను ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా పని నుంచి తొలగించారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా పార్వతీపురం గ్రామానికి చెందిన చిరును పనిలో పెట్టుకుని అతడితో పనులు చేయిస్తుండగా ఖమ్మంరూరల్ ఎస్‌ఐ–2 ఎంఏ రవూఫ్, ఆపరేషన్ స్మైల్ అధికారులు చల్లా వెంగమ్మ, ధనలక్ష్మి, కానిస్టేబుల్ రాజేందర్ తదితరులు పట్టుకున్నారు. అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి పని నుంచి విముక్తి కల్పించారు.

11 కేజీల గంజాయి స్వాధీనం



నిందితుడు, గంజాయిని చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఖమ్మంక్రైం: ఖమ్మం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని నూతన బస్టాండ్ సమీపంలో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా పోడాఘట్ ఖొరాపూర్‌కు చెందిన బాగనగొండి గంజాయిని తరలిస్తూ పట్టుపడ్డాడు. అతడి వద్ద నుంచి 11 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ సీఐలు రాజు, రాజిరెడ్డి, ఎస్‌ఐలు రబ్బానీ, లత, సరిత, సిబ్బంది హెచ్‌బీనాయక్, శశికాంత్, నరేందర్, రమేశ్, సరేందర్, మౌలాంకర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

భద్రాచలంలో గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

భద్రాచలంఅర్బన్: కార్లలో అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ నిషేధిత గంజాయిని ఆదివారం ఎక్సైజ్ శాఖ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి జిల్లా భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యాన విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానస్పదంగా వస్తున్న మూడు కార్లను క్షుణ్ణంగా పరిశీలించగా గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించి దాదాపు ఆరుగురిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన 55 కేజీల గంజాయి విలువ రూ.8.25 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ ఎస్పీ జానయ్య తెలిపారు. కాగా, పట్టుబడిన వ్యక్తులు బొజ్జ మల్లేష్, కస్తూరి గోవర్ధన్, దొంతర్వేని నర్సయ్య, తోకల లక్ష్మణ్‌లది జగిత్యాల జిల్లా కాగా ఉత్తర ఖండ్‌కు చెందిన కిషన్‌సే, దీపక్ శేఖర్ జానే అనే వారు ఒడిస్సా మల్కాన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. ఈమేరకు గంజాయితో పాటు మూడు కార్లను సీజ్ చేశామని పేర్కొన్నారు.

కేసు నమోదు


ఖమ్మంఅర్బన్: ద్విచక్రవాహనాన్ని మరో ద్విచక్రవాహనం ఢీకొట్టిన ఘటనలో ఒకరిపై ఖానాపురం హవేలి పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. కవిరాజ్‌నగర్‌కు చెందిన తోడేటి సునీల్ తన ద్విచక్రవాహనంపై మైసమ్మ గుడి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మరో ద్విచక్రవాహనదారుడు వేగంగా వచ్చి సునీల్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో అతడు గాయపడ్డాడు. బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై పిచ్చికుక్క దాడి

అశ్వారావుపేటరూరల్: ఓ వ్యక్తిపై ఆదివారం పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. బాధితుడి కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని దండాబత్తుల బజారుకు చెందిన బండారు వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఇంటి ముందు నిలబడి ఉండగా, అటుగా వెళ్తున్న ఓ పిచ్చికుక్క అతనిపై ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గమనించి కుటుంబీకులు కుక్క తరిమి స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. కాగా, అశ్వారావుపేటలో గత కొద్ది రోజులుగా పిచ్చి కుక్కలు, కోతులు స్వైరవిహారం చేస్తున్నా.. మేజర్ పంచాయతీ పాలకులకు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

సింగరేణి(కొత్తగూడెం): అనారోగ్య బాధలు భరించలేక ఒక గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం కొత్తగూడెం పట్టణ 1వ, టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే కాలనీలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రైల్వేలో పని చేస్తున్న భూక్యా నాగేశ్వరరావు తన భార్య ప్రమీల(29)తో రైల్వే క్వార్టర్‌లో నివాసముంటున్నారు. ప్రమీల కొన్ని నెలలుగా చెవి, ముక్కుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. ఇంట్లో ఎవరూ లేని సమయాన ఆదివారం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు 

టన్ను ధర	రూ.12,623

సమస్తం ట్యాబ్‌లోనే..

- ప్రభుత్వ పాఠశాలల పూర్తి సమాచారం నిక్షిప్తం
- విద్యార్థుల వివరాలు మొదలు పనులు, పురోగతి కూడా నమోదు
- ఉపాధ్యాయులకు తప్పనున్న ఆన్‌లైన్ ఇక్కట్లు



కొణిజర్ల మండలంలో ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంఈఓ శ్యాంసన్ (ఫైల్)

కొణిజర్ల: ప్రస్తుతం సాంకేతిక జగత్తులో ప్రతి పనికీ ఇంటర్నెట్ సౌకర్యం చాలావరకు అవసరమవుతోంది. ప్రతిదీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నిత్యం ఆన్‌లైన్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాల్సిన పరిస్థితి వస్తున్నది. దీని కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులు నిత్యం ఇంటర్నెట్ సెంటర్లకు పోవాల్సిన అవసరం ఏర్పడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డేటా, పాఠశాలకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాల్సి ఉండటంతో హెచ్‌ఎంలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రాథమిక పాఠశాలలకు ట్యాబ్‌లు ఇవ్వాలని నిర్ణయించి, డీఈఓల చేతుల మీదుగా పంపిణీ చేయిస్తోంది.

కొణిజర్ల మండలంలో మొత్తం 40 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. వీటిలో రెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది 10 మంది కన్నా తక్కువ విద్యార్థులున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు కావడంతో ఆ పాఠశాలకు ట్యాబ్ మంజూరు కాలేదు. మిగిలిన అన్ని పాఠశాలలకు ట్యాబ్‌లు అందజేయనున్నారు. ముందుగా పాఠశాల హెచ్‌ఎం ఐఎస్‌ఎంఎస్ పోర్టల్‌లో తమ పాఠశాల యూజర్‌ఐడీ పాస్‌వర్డ్‌తో ట్యాబ్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ట్యాబ్ తీసుకున్న తర్వాత స్కూల్ స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. దీని పూర్తి బాధ్యత హెచ్‌ఎందే. పాఠశాలకు చెందిన పూర్తి సమాచారం ఈ ట్యాబ్‌లో నిక్షిప్తమై ఉంటుంది. హెచ్‌ఎంలు ఆన్‌లైన్ పనుల కోసం ఇంటర్నెట్ సెంటర్ల చుట్టూ తిరిగే పని తగ్గిపోతుంది. మన ఊరు – మన బడి ఫొటోలు, మధ్యాహ్న భోజన పథకం, ఐఎస్‌ఎంఎస్ పోర్టల్ ద్వారా విద్యార్థుల సమాచారం నిక్షిప్తం చేయడంతో పాటు విద్యార్థులకు ఈ ట్యాబ్‌ల ద్వారా పాఠాలు కూడా బోధించే అవకాశం ఉంది. 4 జీబీ ర్యామ్, 64 జీబీ ఇంటర్నల్ మెమోరీ కలిగిన ఈ ట్యాబ్‌లలో కావాల్సిన డేటాను భద్రపరుచుకోవచ్చు.



జిల్లా వ్యాప్తంగా 915 ప్రాథమిక, 928 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా 928 ట్యాబ్‌లు అందజేశారు. 150 కన్నా ఎక్కువ మంది బాలబాలికలు ఉన్న పాఠశాలలు 13 ఉండగా వాటికి రెండేసి ట్యాబ్‌ల చొప్పున అందజేశారు. ఈ ట్యాబ్‌లు సిమ్ ఆధారంగా పనిచేస్తాయి.

ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసిన ట్యాబ్ ఇదే..

ట్యాబ్‌లతో ఎంతో ఉపయోగం..



మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు కలిపి మొత్తం 46 ఉండగా.. 45 పాఠశాలలకు ట్యాబ్‌లు అందజేశాం. వాటిలో యాప్‌ల ఇన్‌స్టాలేషన్, ఆన్‌లైన్ ప్రక్రియపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నాం. ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతంగా చేయడానికి ఈ ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి.

–మోదుగు శ్యాంసన్, ఎంఈఓ, కొణిజర్ల


శాకాంబరి అలంకరణలో మారెమ్మతల్లి

ఘనంగా ఆషాఢ బోనాల వేడుక



అమ్మవారికి సమర్పించే బోనాలతో అర్చకుడు రామశర్మ, భక్తులు

ఖమ్మంరూరల్: మండలంలోని రెడ్డిపల్లి శ్రీ మారెమ్మతల్లి అమ్మవారికి ఆదివారం శాకాంబరి అలంకరణ చేశారు. పలు రకాల కూరగాయలు, పండ్లతో సుందరంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి ఆషాఢ బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చారు.పాలు, బెల్లం, బియ్యంతో తయారుచేసిన నైవేద్యం, పసుపు, కుంకుమ, చీర, గాజులు, ఒడిబియ్యం తీసుకుని శివసత్తులు మేళతాళాలతో ఆలయానికి చేరుకున్నారు. ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ వేడుకలను ఆలయ కమిటీ చైర్మన్ మట్టా వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు కాశావఝ్జల రామశర్మ, అర్చకులు గండికోట నరేందర్ శర్మ, కాశావఝ్జల సతీష్‌శర్మ, పురాణం చక్రధర్ శర్మతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



కూరగాయలు, పండ్లతో అలంకరించిన అమ్మవారు

కేసీఆర్‌ను నమ్మే స్థితిలో ముస్లింలు లేరు..

- బీఆర్‌ఎస్ నేతలను అసెంబ్లీ గేటు తాకనివ్వనని చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నా..
- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన వారితో పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్/కారేపల్లి: కేసీఆర్ మాయ మాటలు నమ్మి 90 శాతం ముస్లింలు బీఆర్‌ఎస్‌కు ఓటు వేశారని, 12 శాతం రిజర్వేషన్ విషయంలో ఎందుకు కోర్టుకువెళ్లలేదని, ఇక ఆయన్ను ముస్లింలు నమ్మే పరిస్థితి లేదని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మంలోని తుమ్మలగడ్డ మజీద్ ప్రాంతంలో పలు ముస్లిం కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి పొంగులేటి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ వాగ్దానాలు చేయడంలో దిట్ట అని, ఇప్పుడు కొత్తగా స్థలం ఉన్న వారికి రూ.3 లక్షలు ఇస్తామని చెబుతున్నారని, ఇవన్నీ అబద్ధాలేనని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను అసెంబ్లీ గేట్ తాకనివ్వనని చెప్పిన మాటకు తాను కట్టుబడి ఉన్నానని, తెలంగాణ ఇస్తే ఆంధ్రలో కాంగ్రెస్ చచ్చిపోతుందని తెలిసి కూడా సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని, చావునోటిదాక వెళ్లి తెలంగాణ తెచ్చానని చెబుతున్న కేసీఆర్ ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో నిమ్మరసం తీసుకున్న తర్వాత ఉస్మానియా యూనివర్సిటీలో యువత పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తే నిమ్మరసం తీసుకోలేదని అబద్ధాలు ఆడారన్నారు. బీఆర్‌ఎస్ వాళ్ల పదవులు కేవలం 55 నుంచి 58 రోజులలోపే ఉంటాయని, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే, కారేపల్లి మండలం లావుడ్యాతండాలో సుమారు 500 కుటుంబాలు ఆదివారం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా జరిగిన సభలో పొంగులేటి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దొంగ దీక్ష చేస్తే తెలంగాణ రాలేదని, 1,400 మంది యువకులు బలిదానాలు చేస్తే చలించిన సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. అర్హులైన గిరిజన పోడు రైతులు 14 లక్షల ఎకరాలకు దరఖాస్తు చేసుకుంటే, అరకొరగా 4 లక్షల ఎకరాలకు పట్టాలిస్తున్నారని, అది కూడా గులాబీ రంగు చొక్కా వేసుకున్న వారికి తప్ప మిగతా పార్టీల్లో ఉన్న వారికి ఇవ్వడం లేదని ఆక్షేపించారు. తొలుత భాగ్యనగర్ మెయిన్ రోడ్డు నుంచి లావుడ్యాతండా వరకు ర్యాలీ నిర్వహించి.. పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో ఎండీ ముస్తఫా, మియాభాయ్, మిక్కిలినేని నరేంద్ర, మద్దినేని బేబీస్వర్ణకుమారి, కొప్పెర ఉపేందర్, ఇమామ్, బొర్రా రాజశేఖర్, తుళ్లూరి బ్రహ్మయ్య, తలారి చంద్రప్రకాశ్, బాణోతు విజయాబాయి, మంగీలాల్, బాబు, ఎ.ఈశ్వరీనందరాజ్, ఈశ్వరీబాయి, ఇమ్మడి తిరుపతిరావు, ఎం.నాగేశ్వరరావు, అజ్మీర నరేశ్, ఆదెర్ల స్రవంతి, బాణోతు హీరాలాల్, గుగులోతు భీముడు, మండెపూడి సత్యనారాయణ, గుగులోతు శ్రీను, ధోని షేరు, హేమ్లా, నాగండ్ల జగన్, రాంచందర్, మంగీలాల్, బాబు, షేక్ సైదులు పాల్గొన్నారు.

అధిష్టానం ఆదేశిస్తే ఎక్కడైనా పోటీ చేస్తా



మాట్లాడుతున్న రేణుకాచౌదరి

ఖమ్మం సహకారనగర్ : వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానని కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి అన్నారు. డీసీసీ కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో గ్రూప్‌లు లేవన్నారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన సభకు ప్రజలు రాకుండా అడ్డుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే రెట్టింపు ఉత్సాహంతో హాజరయ్యారని, సభను చూసి బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు అదిరిపోయాయన్నారు. రాష్ట్రంలో బీజేపీ అడ్రస్ లేకుండాపోయిందని, ఖమ్మం సభతో బీఆర్‌ఎస్ కారు టైర్ల గాలి దిగిపోయిందన్నారు. తాను పాలేరు నుంచి పర్ణశాల వరకు వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేశానని గుర్తు చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు కురవి రత్నం, వడ్డెబోయిన నర్సింహారావు, ముస్తాఫా, రఫీదాబేగం, రామసహాయం మాధవిరెడ్డి, మట్టా దయానంద్, మిక్కిలినేని నరేందర్, మంజుల, సూరంపల్లి రామారావు, కట్ల రంగారావు, రామ్మూర్తి నాయక్, నున్నా రామకృష్ణ పాల్గొన్నారు.

సమ్మె శిబిరంలో కార్మికుడికి అస్వస్థత



చికిత్స పొందుతున్న కార్మికుడు బాబు

నేలకొండపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరంలో ఆదివారం ఓ కార్మికుడు అస్వస్థతకు గురయ్యాడు. నేలకొండపల్లి మండలంలోని అనాసాగరం గ్రామ పంచాయతీకి చెందిన మల్టీపర్పస్ వర్కర్ బొడ్డు బాబు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. సహచర కార్మికులు వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. కార్మికుడిని పలు పార్టీల నాయకులు సీవై పుల్లయ్య, రామదాసు, నూక హనుమంతరావు తదితరులు పరామర్శించారు.

మా శవాలపై రైల్వేలైన్ వేయండి..

- చావనైనా చస్తాం కానీ భూములు ఇచ్చేది లేదు
- అఖిలపక్షం సమావేశంలో బోదులబండ రైతులు



సమావేశంలో మాట్లాడుతున్న నెల్లూరి భద్రయ్య

నేలకొండపల్లి: తమ బతుకులు నాశనం చేసే రైల్వే లైన్ వద్దని, అధికారులు బలవంతం చేస్తే చావనైనా చస్తామని, కానీ భూములు ఇచ్చేది లేదని రైతులు హెచ్చరించారు. మండలంలోని బోదులబండ గ్రామంలో డోర్నకల్ – మిర్యాలగూడెం రైల్వేలైన్‌పై ఆదివారం మాజీ సర్పంచ్ కట్టికోల నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన అఖిలపక్షం సమావేశంలో రైతులు రైతులు అనంతు భాగ్యమ్మ, గడుపూడి పద్మ మాట్లాడారు. ఉన్న కొద్దిపాటి భూములతో జీవనం సాగిస్తున్న తమ బతుకులను ఛిద్రం చేసే రైల్వేలైన్ తమకొద్దని, బలవంతంగా వేయాలని చూస్తే అది తమ శవాలపై వేసుకోవాలని హెచ్చరించారు. తమ కడుపులు కొట్టే రైల్వేలైన్‌ను వ్యతిరేకిస్తూ గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉద్యమం చేయటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లాకు చెందిన మంత్రి, ఎంపీ, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు తమ గోడును అర్థం చేసుకుని సన్న, చిన్న కారు రైతులకు అన్యాయం చేసే రైల్వేలైన్ అలైన్‌మెంట్‌ను మార్చేందుకు కృషి చేయాలని కోరారు. కాగా, రాజకీయాలకు అతీతంగా దశలవారీగా ఉద్యమాలు చేపట్టేందుకు సమావేశంలో తీర్మానం చేశారు. సమావేశంలో రచ్చా నరసింహారావు, మీసా ముత్తయ్య, నాగుబండి శ్రీనివాసరావు, కట్టికోల సుధాకర్, అనంతు కాశయ్య, నెల్లూరి భద్రయ్య, చింతలపాటి భాస్కర్, నెల్లూరి భరత్, అనగాని నరసింహారావు, అనంతు ఉపేందర్, అనంతు రామదాసు, కట్టికోల వెంకన్న, వట్టికూటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

12న విద్యాసంస్థల బంద్

- కేజీ టు పీజీ ఉచిత విద్య అంటూనే బుక్స్, నోట్‌బుక్స్ ఇవ్వలేకపోయారు
- విలేకరుల సమావేశంలో వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: విద్యారంగంపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకించడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రించాలనే డిమాండ్లతో ఈ నెల 12న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపునిస్తున్నామని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని గిరిప్రసాద్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు విద్యార్థి సంఘాల బాధ్యులు ఇటికాల రామకృష్ణ, వి.వెంకటేశ్, జి.మస్తాన్, టి.ప్రవీణ్ మాట్లాడారు. స్కూళ్లు ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా ఇప్పటివరకు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం అందించలేదని, కేజీ టు పీజీ ఉచిత విద్య అంటూనే రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలను మూసివేసే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. గురుకులాల పేరు చెబుతున్న ప్రభుత్వం.. వాటిల్లో కనీస సౌకర్యాలు కూడా లేవని, ప్రభుత్వం జీఓ నంబర్–1ని తీసుకొచ్చినా ప్రైవేట్ పాఠశాలల్లో అమలు చేయడం లేదని, అధిక ధరలకు పాఠశాలల యాజమాన్యాలే పుస్తకాలు, నోట్‌బుక్స్ విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం కొమ్ముకాయడం వల్ల నిరుపేదలు విద్యకు దూరమయ్యే దుస్థితి వచ్చిందని, వీటన్నింటికీ నిరసనగా 12న తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌కు తల్లిదండ్రులు, విద్యార్థులు మద్దతు పలికి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు సందీప్, చందులాల్, లక్ష్మణ్, వీరేందర్, కరుణ్, రవి, సాయి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురై వ్యక్తి మృతి

మృతదేహంతో చిట్టీవ్యాపారి ఇంటి ఎదుట ఆందోళన



చిట్టీవ్యాపారి ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

సత్తుపల్లి: అప్పు ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై అస్వస్థతతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సత్తుపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన తాపీమేస్త్రీ షేక్ ఇమామ్‌సాహెబ్(55) అదేకాలనీకి చెందిన చిట్టీ వ్యాపారి షేక్ షంషుద్దీన్‌కు 2014లో రూ.2 లక్షలు అప్పుగా ఇచ్చాడు. ఇప్పటి వరకు తిరిగి ఇవ్వకపోగా.. షంషుద్దీన్ నిర్లక్ష్యంగా వహరిస్తున్నాడని మనస్తాపానికి గురైన ఇమామ్‌సాహెబ్ అస్వస్థతకు గురయ్యాడు. అతడిని విజయవాడ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆదివారం ఇంటికి తీసుకురాగా మృతి చెందాడు. దీంతో ఇమామ్‌సాహెబ్ మృతదేహంతో షంషుద్దీన్ ఇంటి ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. దహన సంస్కారాలకు కూడా చేతిలో చిల్లిగవ్వలేదని.. కుటుంబ పెద్దదిక్కును కోల్పోయామని న్యాయం చేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని సర్ది చెప్పటంతో ఆందోళన విరమించారు. స్థానిక అర్బన్ పార్కులో దహన సంస్కారాలు నిర్వహించేందుకు మృతదేహాన్ని తీసుకెళ్తుండగా అటవీశాఖ ఉద్యోగులు ప్రతిఘటించారు. తోపులాట జరిగింది. ఎట్టకేలకు లోపలికి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

నాటు సారా స్థావరాలపై దాడులు



బెల్లం పానకాన్ని ధ్వంసం చేసిన అధికారులు

చర్ల: మండలంలోని కందిపాడు, తిప్పాపురం అటవీ ప్రాంతాలలో గల నాటుసారా స్థావరాలపై ఆదివారం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు సుమారు 2 వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఖమ్మం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కమిషనర్ గణేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సూపరింటెండెంట్ జానకయ్య ఆధ్వర్యాన నిర్వహించిన ఈ దాడుల్లో స్టేట్ టాస్క్‌ఫోర్స్ సీఐ లతీఫ్, ఖమ్మం ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వర్, కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కి‘లేడి’!

- ఉద్యోగాల పేరుతో యువతకు బురిడీ?
- రూ.లక్షలు పోగొట్టుకున్న పలువురు
- న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించిన వైనం



పాల్వంచ: ఉద్యోగాలు కల్పిస్తానని నమ్మించి రూ.లక్షలు వసూలు చేసింది ఓ మహిళ. హైదరాబాద్ హైటెక్ సిటీలో తమకు పలుకుబడి ఉందని స్టార్టింగ్ శాలరీనే రూ.లక్ష ఉంటుందని చెప్పి నిరుద్యోగుల నుంచి భారీ మొత్తంలో వసూలు చేసింది. వివరాలిలా.. గాంధీనగర్‌కు చెందిన ఓ మహిళ హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో హెచ్‌ఆర్‌గా ఉద్యోగం చేస్తున్నానని నమ్మబలికింది. తన భర్త ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారని, హైటెక్‌సిటీలో తనకున్న పలుకుబడితో మంచి శాలరీ కలిగిన ఉద్యోగాలు ఇప్పిస్తానని అందుకు రూ.2లక్షలు ఇవ్వాలని, ఉద్యోగంలో చేరిన తర్వాత నెల శాలరీలో సగం చొప్పున రెండు నెలలు ఇవ్వాలని నమ్మబలికింది. దీంతో ఆమె మాటలు నమ్మి కేటీపీఎస్ ఉద్యోగుల కుమారులు కొందరు ఆమెకు రూ.లక్షలు సమర్పించుకున్నారు.

తల్లిదండ్రుల అకౌంట్‌లోకే నగదు..

ఈనేపథ్యాన బీ కాలనీకి చెందిన ఓ ఇంట్లో ఇద్దరు రూ.6లక్షలు సమర్పించుకున్నారు. ఈ సొమ్మును నగదు రూపంలో కొంత, మిగితా సొమ్మును విడతల వారిగా మహిళ తల్లిదండ్రులకు చెందిన అకౌంట్‌లకు ఫోన్‌పేల రూపంలో తీసుకుంది. కాగా వీరిని నమ్మించేందుకు కొన్ని కంపెనీల బ్రోచర్‌లను, కంపెనీ లెటర్స్‌ను చూపించిందని బాధితులు వాపోయారు. అదే విధంగా సీతారాంపట్నం, శేఖరం బంజర, పాల్వంచ, కొత్తగూడెంకు చెందిన వారికి సాఫ్ట్‌వేర్‌తో పాటు కేటీపీఎస్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి రూ.లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. ఈమె మాయలో పడిన కొందరు బాధితులు ఇప్పటికే పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో పాటు, ఫోన్ పేలు కొట్టిన ఆధారాలు, ఇతర ఆధారాలను పోలీసులకు సమర్పించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ప్రచారం రావడంతో మిగతా బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తుండడం గమనార్హం. ఈమె వలలో సుమారు 20 మందికిపైగా ఉన్నట్లు సమాచారం.

క్లుప్తంగా...

శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు



ఆలయం వెలుపల జస్టిస్ ఏవీ రవీంద్రబాబు

తిరుమల: తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్‌లు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 86,781 మంది శ్రీవారిని దర్శించుకుని హుండీలో రూ.3.47 కోట్లు వేశారు. టైంస్లాట్ టోకెన్లు ఉన్నవారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల్లో.. ఎస్‌ఈడీ టోకెన్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది. కాగా, శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు, తెలంగాణ మంత్రి సత్యవతి రాథోడ్ దర్శించుకున్నారు.

లంక భూములకు పట్టాలు

9 వేల ఎకరాలు..
19 వేల మందికి పైగా లబ్ధిదారులు

సాక్షి, అమరావతి: కృష్ణా, గోదావరి నదీ తీరంలో ఉన్న లంక భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలిచ్చేందుకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఎనిమిది జిల్లాల్లో ఉన్న కృష్ణా, గోదావరి లంకల్లోని 9,062 ఎకరాలకు సంబంధించిన 19 వేల మందికిపైగా ఈ పట్టాలు ఇవ్వనుంది. మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర వేయడమే తరువాయి. ఆ తర్వాత పట్టాల పంపిణీ ప్రారంభం కానుంది. ఏపీలోని నిరుపేదలకు 54 వేల ఎకరాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లుచేస్తున్న విషయం తెలిసిందే. ఆ భూములతోపాటే లంక భూములను సాగుచేసుకుంటున్న రైతులకు డి-పట్టాలు ఇవ్వనున్నారు. ఈ భూములను మూడు కేటగిరీలుగా విభజించారు. గట్టుకు దగ్గరగా ఉండి వరద వచ్చినా కొట్టుకుపోని భూమిని ఏ-కేటగిరీగా.. వీటికి ఆనుకుని కొంత నదిలోకి ఉన్న భూమిని బి-కేటగిరీగా.. ఏ, బీ కేటగిరీకి ఆనుకుని వరదలొస్తే పూర్తిగా మునిగిపోయే భూమిని సీ-కేటగిరీగా విభజించారు. ఎ-కేటగిరీలో 475.93 ఎకరాలను 1,178 మందికి.. బి-కేటగిరీలో 848.22 ఎకరాలను 2,333 మందికి.. సి-కేటగిరీలో 7,738.25 ఎకరాలను 15,665 మందికి ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకు అసైన్‌మెంట్ కమిటీలు ఆమోదం కూడా తెలిపాయి.

గ్లోబల్ టూరిజం మ్యాపులో గండికోట

- సెవెన్ స్టార్ హోటల్ ఒబెరాయ్‌కి శంకుస్థాపన కార్యక్రమంలో ఏపీ సీఎం జగన్
- విశాఖ, తిరుపతిలో కూడా ఒబెరాయ్ గ్రూప్ హోటల్స్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, కడప: గ్రాండ్ కాన్యన్ ఆఫ్ ఇండియాగా పిల్చుకునే మన గండికోటను ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని గండికోటలో ఆదివారం ఆయన ఒబెరాయ్ హోటల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తిరుపతి, విశాఖపట్నం ఒబెరాయ్ హోటల్స్‌కు కూడా వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడారు. ఒక్క రోజే గండికోట, విశాఖపట్నం, తిరుపతితో కలిపి మూడు చోట్ల ఒబెరాయ్ హోటళ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు జరగడం సంతోషకరం అని చెప్పారు. ఒబెరాయ్ లాంటి గ్రూపు ఇక్కడకు వచ్చి.. సూపర్ లగ్జరీ సెవెన్ స్టార్ హోటల్ నిర్మాణం చేపడుతోందన్నారు. ఇలాంటి పెద్ద పెద్ద గ్రూపులు వచ్చి ఇలాంటి హోటల్స్ కడితే గండికోట గ్లోబల్ టూరిజం మ్యాప్‌లోకి చేరుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల వైఎస్సార్ జిల్లా, గండికోట రెండూ అంతర్జాతీయంగా చోటు దక్కించుకుంటున్నాయని అన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఉద్యోగావకాశాలు విస్తృతం

- ఈ హోటల్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 500 నుంచి 800 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఒబెరాయ్ ప్రాజెక్టు అనేది మిగిలిన ప్రాజెక్టులు రావడానికి ఒక దిక్సూచిగా ఉపయోగపడుతుంది. గండికోటలో ఇలాంటి గ్రూపు ప్రాజెక్టులు రావడానికి ఇంకా అవకాశం ఉంది. ఒబరాయ్ లాంటి ఇంకో గ్రూపుని తీసుకొచ్చే కార్యక్రమం ముమ్మరంగా చేస్తాం.
- ఇంతకుముందు విక్రమ్ ఒబెరాయ్‌తో మాట్లాడుతూ ఇక్కడ గోల్ఫ్ కోర్ట్ పెట్టే ఆలోచన చేస్తే హోటల్‌కు మంచిదని, ఈ ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగవుతాయని.. ఈ హోటల్‌ను ఒక గోల్ఫ్ రిసార్ట్‌గా దేశానికి, ప్రపంచానికి పరిచయం చేసే అవకాశాలు ఉంటాయని చెప్పాను. ఆ దిశగా అడుగులు వేసేలా ఆలోచన చేస్తామన్నారు.
- జమ్మలమడుగు నియోజకవర్గంలో స్టీల్ ఫ్యాక్టరీ రావాలని కలలు కన్నాం. మన పిల్లలకు ఇక్కడే ఉద్యోగ అవకాశాలు రావాలని దశాబ్దాలుగా కన్న కలను నిజం చేస్తూ గతేడాది జిందాల్ గ్రూపుతో కలిసి ఆ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాం. ఇందుకు సంబంధించిన వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్‌కు ఈ నెలలోనే ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ వస్తుంది. ఆ తర్వాత రెట్టించిన వేగంతో పనులు జరుగుతాయి.
- రేపు కొప్పర్తిలో డిక్సన్ కంపెనీకి సంబంధించిన ప్లాంట్‌కు ప్రారంభోత్సవం చేస్తున్నాం. కొప్పర్తిలో డిక్సన్ గ్రూపు 1000కి పైగా ఉద్యోగాలు ఇచ్చింది. మరో రెండు నెలల్లో ఇంకో 1000 ఉద్యోగాలు రాబోతున్నాయి. చానల్ ప్లే అనే మరో కంపెనీ హోం ఆడియో సిస్టమ్స్ తయారు చేస్తుంది. రేపు కొప్పర్తిలో ఆ కంపెనీతో ఎంఓయూపై సంతకాలు చేయనున్నాం. ఈ కంపెనీ ద్వారా 150 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.
- ఎల్‌ఈడీ టీవీలు, ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్స్ తయారు చేసే టెక్నో డామ్ ఇండియా అనే మరో కంపెనీతో కూడా రేపు ఎంఓయూ చేయబోతున్నాం. ఈ కంపెనీ ద్వారా మరో 200 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.



సెవెన్ స్టార్ హోటల్ ఒబెరాయ్‌కి శంకుస్థాపన చేస్తున్న సీఎం జగన్, చిత్రంలో విక్రమ్ ఒబెరాయ్

ప్రస్తుతం దేశంలో పర్యాటకం కీ రోల్ పోషిస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఒక దార్శనికతతో తన డైనమిక్ లీడర్షిప్‌తో సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పర్యాటక రంగం అభివృద్ధి చెందుతోంది. ఇందులో మమ్మల్ని భాగస్వాములను చేస్తున్నందుకు కృతజ్ఞతలు. ప్రపంచ స్థాయి సెవెన్ స్టార్ రిసార్ట్స్‌ను, మంచి రూమ్స్, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేస్తాం. ఏపీలో హోటల్స్ స్థాపించడం వల్ల ఇక్కడి వారికి ఉపాధి ఇవ్వగలుగుతాం. ప్రఖ్యాతిగాంచిన ఈ గండికోటలో మంచి సౌకర్యాలతో లగ్జరీ సెవెన్ స్టార్ రిసార్ట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. తిరుపతి, వైజాగ్‌లో కూడా హోటల్స్‌ను ప్రారంభిస్తాం. 2025కు ఈ హోటల్స్ ప్రారంభమవుతాయి.
– విక్రమ్‌సింగ్ ఒబెరాయ్, ఒబెరాయ్ హోటల్స్ సీఈవో

శ్రీకాళహస్తిలో ఘోర ప్రమాదం

- లారీని ఢీకొట్టిన కారు
- ఆరుగురు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సమీపంలోని మిట్టకండ్రిగ వద్ద ఆదివారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. లారీని ఓవర్‌టేక్ చేసిన కారు ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొంది. ఈ దుర్ఘటనలో విజయవాడకు చెందిన ఆరుగురు మృత్యువాతపడగా.. ఓ యువకుడు తీవ్రగాయాలతో మిట్టకండ్రిగ వద్ద ఆస్పత్రి పాలయ్యాడు. సీఐ అంజు యాదవ్ కథనం ప్రకారం.. విజయవాడ కృష్ణలంకలోని బాలాజీ టవర్స్ 304 ప్లాట్‌లో ఉంటున్న తుంగల రమేష్‌బాబు, ఆయన భార్య రాజ్యలక్ష్మి(40), కుమారుడు భరత్(ఇంటర్), విజయవాడ సమీపంలోని ఉయ్యూరులో ఉంటున్న రాజ్యలక్ష్మి అక్క శ్రీలత(42), కృష్ణలంక ప్రాంతంలోని బాలాజీనగర్ పోలీస్ కాలనీలో ఉంటున్న రాజ్యలక్ష్మి స్నేహితురాలు రమణి(38), ఆమె భర్త మూర్తి(47), కుమార్తె అక్ష్య(17)లు కారులో శుక్రవారం రాత్రి తిరుమలకు బయలుదేరారు. శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆదివారం వేకువజామున తిరుగుపయనమయ్యారు. శ్రీకాళహస్తి రెండు కిలోమీటర్ల దూరం ఉందనగా.. మిట్టకండ్రిగ వద్ద రమేష్‌బాబు నడుపుతున్న కారు ఓ లారీని ఓవర్‌టేక్ చేసి ఎదురుగా వస్తున్న మరో లారీని వేగంగా ఢీకొట్టింది. కారు నడుపుతున్న తుంగల రమేష్‌బాబు, భార్య రాజ్యలక్ష్మి(40), ఆమె అక్క శ్రీలత(42), స్నేహితురాలు రమణి(38), ఆమె భర్త మూర్తి(47), కుమార్తె అక్ష్య(17) అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. ఇంటర్మీడియెట్ చదువుతున్న తుంగల భరత్ ఒక్కడే తీవ్ర గాయాలపాలై ప్రాణాలతో బయటపడ్డాడు. మృతదేహాలను కారులోంచి బయటకు తీసేందుకు రెండు గంటలపాటు శ్రమించాల్సి వచ్చింది. డ్రైవింగ్ చేస్తున్న రమేష్ మృతదేహం ఎంతకీ రాకపోవడంతో క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కకు తొలగించి ఆపై కట్టర్లతో కారు డోరును కత్తిరించాల్సి వచ్చింది. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.



శ్రీకాళహస్తి వద్ద ఢీకొన్న కారు, లారీ

‘తానా’లో బాహాబాహి

- ‘జై ఎన్టీఆర్’ నినాదాల కలకలం
- తన్నుకున్న లోకేశ్, జూ.ఎన్టీఆర్ వర్గాలు
- చొక్కాలు పట్టుకుని.. కర్రలు విసురుకుంటూ

పెన్సిల్వేనియా(అమెరికా): అమెరికాలో ‘తానా’(ఉత్తర అమెరికా తెలుగు సంఘం) సభల సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్, లోకేశ్ వర్గాలు పరస్పరం తన్నుకున్నాయి. రెండుగా చీలిపోయిన టీడీపీ ఎన్నారై సభ్యులు పిడిగుద్దులు గుద్దుకున్నారు. తరని పరుచూరి, సతీష్ వేమన వర్గాలు పరస్పరం చొక్కాలు పట్టుకుని మరీ దాడులకు దిగాయి. టీడీపీ ఎన్నారై అధ్యక్షుడు కోమటి జయరాం సమక్షంలోనే ఈ ఘటన జరిగింది. ఈ ఘర్షణకు ప్రధాన కారణం లోకేష్ నాయకత్వంపై వ్యక్తమైన విమర్శలే కారణమని తెలుస్తోంది. ఈ సమావేశాల సందర్భంగా కొందరు తెలుగు తమ్ముళ్లు ‘జై ఎన్టీఆర్’అని నినదించడంతో ఉలిక్కిపడ్డ చంద్రబాబు వర్గం దాడులకు తెగబడినట్లు తెలుస్తోంది. పార్టీ పగ్గాలు చంద్రబాబు చేతిలో ఉన్నంతవరకు టీడీపీకి మనుగడ లేదని, 2024లోనూ మరోసారి పరాజయం ఖాయమని కొందరు వాదించినట్లు సమాచారం. తనను తాను మూర్ఖుడిగా చెప్పుకునే లోకేష్‌కు బదులుగా జూనియర్ ఎన్టీఆర్‌కు పార్టీ పగ్గాలను అప్పగించాలని ఓ వర్గం డిమాండ్ చేసింది. దీంతో కలవరం చెందిన చంద్రబాబు వర్గం దాడులకు దిగినట్లు తెలిసింది. అమెరికాలో సుదీర్ఘ చరిత్ర కలిగిన తానాకు ఈ ఘటన మాయని మచ్చలా మిగిలింది.

కర్రలు విసురుకుంటూ..

పెన్సిల్వేనియాలో తానా 23వ మహాసభలను ఘనంగా ప్రారంభించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రిటైర్డ్ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, తెలంగాణ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తదితరులు ఈ వేడుకలను ప్రారంభించారు. తొలిరోజు బాంకెట్ డిన్నర్ ముగిసిన అనంతరం తానాలోని కొందరు ప్రముఖులు కన్వెన్షన్ సమీపంలోని హాలులో కలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీకి సంబంధించిన అంశాలపై తరని పరుచూరి, సతీష్ వేమన వర్గాల మధ్య వివాదం రేగడంతో ముష్టి యుద్ధానికి దిగాయి. వివాదం శృతి మించడంతో కొందరు అందుబాటులో ఉన్న కర్రలను విసిరారు. ప్రతిష్టాత్మక తానా సంస్థను రాజకీయ సంస్థగా మార్చిన ఘనత చంద్రబాబుదేననే విమర్శలున్నాయి. నిధుల సేకరణ కోసం తానాను ఆయన కామధేనువులా మార్చుకున్నారు.



దేశంలో బీసీలను ఆదరిస్తున్న ఏకైక సీఎం జగనే..

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య



నరసరావుపేట: దేశంలో బీసీలకు అధికారం కల్పించి వారిని ఆదరిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ ఒక్కరేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చెప్పారు. దేశ ప్రధానిగా నరేంద్ర మోదీతో పాటు ఎన్నో రాష్ట్రాలకు బీసీలు సీఎంలుగా ఉన్నా వారు బీసీలకు చేయలేని మేలు సీఎం జగన్ ఏపీలో చేశారని కొనియాడారు. నరసరావుపేట టౌన్‌హాల్లో ఆదివారం నిర్వహించిన పల్నాడు బీసీ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశానికి కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ అడక్కుండానే బీసీలకు అన్నీ ఇస్తున్నారని ప్రశంసించారు. పక్క రాష్ట్రాలైన ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, ఛతీస్‌గఢ్ లాంటి రాష్ట్రాల్లో పర్యటిస్తే సీఎం జగన్ విలువ తెలుస్తుందన్నారు. కర్ణాటకలో సిద్ధరామయ్య, తమిళనాడులో స్టాలిన్, చతీస్‌ఘడ్ రాష్ట్రాల్లో బీసీలే సీఎంలు, మంత్రులుగా ఉన్నా అక్కడ అమ్మ ఒడి లేదన్నారు. ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్ తిరిగానని, పశ్చిమబెంగాల్లో గురుకులాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి వంటి పథకాలు లేవని చెప్పారు. బీసీ కులాల పిల్లలు అడుక్కు తినే స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఛతీస్‌ఘడ్‌లో హాస్టళ్లు, గురుకులాలు, స్కాలర్‌షిప్‌లు లేవని, బీసీ వర్గీయులు అందరూ కూలి పని, భిక్షాటన చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. అనేక రాష్ట్రాల్లో బీసీ కులాలను చదవనీయకుండా కుట్ర జరుగుతోందని, ఇక్కడ సీఎం జగన్ మాత్రం బీసీలు చదువుకుంటేనే గొప్పవారవుతారని, పేదరికం తగ్గుతుందని వారికోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసిందని విమర్శించారు.

జిల్లా వార్తలు

రాత పరీక్షకు 426 మంది



పరీక్షను పరిశీలిస్తున్న జీఎం బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 20 జూనియర్ కెమిస్ట్/ టెక్నికల్ ఇన్‌స్పెక్టర్ గ్రేడ్-డీ (ఇంటర్నల్) పోస్టుల భర్తీకి స్థానిక సింగరేణి మహిళా కళాశాలలో ఆదివారం నిర్వహించిన రాత పరీక్షకు 426 మంది అభ్యర్థులు హాజరయ్యారని రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్య తెలిపారు. రాత పరీక్షను పర్యవేక్షించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ పోస్టుల భర్తీకి గత మార్చిలో నోటిఫికేషన్ వెలువరింగా 11 ఏరియాలకు చెందిన సుమారు 500 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 492 మందికి హాల్‌టికెట్లు పంపిణీ చేశామని చెప్పారు. అందులో 426 మంది హాజరు కాగా, 66 మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఫలితాలను ఆదివారం రాత్రికే సింగరేణి వెబ్‌సైట్‌లో, ప్రధాన కార్యాలయంలోని నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచామని తెలిపారు. జీఎంలు హనుమంతరావు, దీక్షతులు, డీజీఎం శ్రీనివాస్ కూడా పరీక్షను పర్యవేక్షించారు.

జాతీయోద్యమ ఆకాంక్షల సాధనకు పోరాడుదాం



మాట్లాడుతున్న గాదె ఇన్నయ్య

భద్రాచలంఅర్బన్ : జాతీయోద్యమ ఆకాంక్షల సాధనకు మతతత్వ, మనువాద వ్యతిరేక శక్తులు, మేధావులు, యువత ఏకమై పోరాడాలని భారత్ బజావో జాతీయ కౌన్సిల్ సభ్యులు గాదె ఇన్నయ్య అన్నారు. భద్రాచలంలోని గిరిజన భవన్‌లో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పాలకులు విద్వేష రాజకీయాలపై ఆధారపడి పాలన సాగిస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా కట్టబెడుతున్నారని ఆరోపించారు. కార్పొరేట్ శక్తుల బ్యాంకు బకాయిలను రద్దు చేస్తూ ప్రజాధనాన్ని బడా వ్యాపారస్తులకు దోచిపెడుతున్నారని అన్నారు. చల్లగుళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో టీజేఎస్ నాయకులు మల్లెల రామనాథం, బత్తుల కృష్ణయ్య, నబీ సాహెబ్, రామాచారి, బిక్కులాల్, భానుప్రసాద్, న్యాయవాదులు రవివర్మ, శ్రీనివాస్, కెచ్చెల కల్పన, అలవాల రాజా, కుంజా సీతారాములు, అల్లాడి పాల్‌రాజు, దాసరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


రారెత్తిస్తున్న టమాట!



- భగ్గుమంటున్న కూరగాయల ధరలు
- ప్రతికూల వాతావరణంతో తగ్గిన పంటల సాగు
- దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేస్తున్న వ్యాపారులు
- పేద, మధ్యతగరతి వర్గాలపై మోయలేని భారం



ఖమ్మం రైతు బజార్‌లో విక్రయిస్తున్న కూరగాయలు



ఖమ్మంవ్యవసాయం: ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు.. అన్న చందంగా ఉంది ప్రస్తుత నిత్యావసరాల ధరల పరిస్థితి. పేద, మధ్య తరగతి వర్గాల వారికి కూరగాయల భోజనం కూడా భారంగా మారింది. మార్కెట్‌లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ఏది కొందామన్నా కిలో రూ.50 పైమాటే. ఇక ప్రతి కూరలో వేసుకునే పచ్చిమిర్చి, టమాట ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇవి కిలో రూ.100 నుంచి రూ. 120 వరకు ఉన్నాయి. నలుగురు సభ్యులున్న కుటుంబమైతే రోజుకు రూ. 300లు కూరగాయలకే వెచ్చించాల్సి వస్తోంది. అంత ధర పెట్టినా తాజా కూరగాయలు లభించడం లేదు. వాతావరణం, వర్షాభావ పరిస్థితులు కూరగాయల ధరలపై ప్రభావం చూపుతున్నాయి. ఆకుకూరలు మినహా అన్ని కూరగాయలు ధరలూ అధికంగానే ఉన్నాయి. స్థానికంగా కూరగాయ పంటల సాగులేక దూర ప్రాంతాల నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో ధరలు భారీగా పెరిగాయి.

రైతు విక్రయాలు అంతంతమాత్రమే...

జిల్లాలో రైతులు కూరగాయలు విక్రయించడం ఇటీవల బాగా తగ్గిపోయింది. ఈ ఏడాది ఏప్రిల్ వరకు దాదాపు అన్ని మండలాల్లో రైతులు కూరగాయలు పండించి ఖమ్మం నగరంతో పాటు, అందుబాటులోని పట్టణాల్లో గల రైతు బజార్లలో, కూడళ్లలో నేరుగా విక్రయించేవారు. మే నుంచి రైతు విక్రయాలు బాగా తగ్గాయి. అకాల వర్షాలు, తెగుళ్ల కారణంగా కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతు బజార్లలో రైతుల విక్రయాల కంటే వ్యాపారుల విక్రయాలే అధికమయ్యాయి.

వ్యాపారులు నిర్ణయించిందే ధర

జిల్లాలో కూరగాయల పంటల సాగు అంతగా లేకపోవడంతో ధరలు పూర్తిగా వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాయి. వారు నిర్ణయించిన ధరలే ఇక్కడ శిరోధార్యం. జిల్లాలోని హోల్‌సేల్ కూరగాయల వ్యాపారులు సిండికేట్‌గా మారి హైదరాబాద్ ధరలకు దాదాపు సమానంగా నిర్ణయించి ఇక్కడ విక్రయిస్తున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు నిర్ణయించే ధరలపై కొంత లాభాలను చూసుకొని రిటైల్ వ్యాపారులు అమ్ముతున్నారు.

సామాన్య, మధ్య తరగతి ప్రజలపై భారం..

ప్రస్తుతం కూరగాయల ధరలు పేద, మధ్య తరగతి ప్రజలుకు అందుబాటులో లేకుండా పోయాయి. ఏ కూరగాయలను కొందామన్నా కిలో రూ.50, ఆపైనే ఉన్నాయి. పచ్చడి తయారు చేసుకుందామన్నా పచ్చిమిర్చి ధర మరింత ఘాటెక్కింది. కిలో పచ్చిమిర్చి ప్రాంతాన్ని బట్టి రూ. 110 నుంచి రూ.120 వరకు పలుకుతుండడం గమనార్హం. ఇక టమాట కూడా కిలో రూ.110 పైనే ఉంది.

రైతుబజార్‌లో కూరగాయల ధరలిలా (కిలో రూ.లలో)

కూరగాయలు	మే 18న	ప్రస్తుతం
టమాట	20	100
వంకాయ	20	36
బెండకాయ	26	36
పచ్చిమిర్చి	60	100
కాకర కాయ	46	80
దొండకాయ	20	29
సొరకాయ	16	26
దోసకాయ	18	38
చిక్కుడు	50	68
క్యారెట్	36	56

దూర ప్రాంతాల నుంచి దిగుమతి

స్థానికంగా కూరగాయల పంట ఉత్పత్తులు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో వ్యాపారులు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు మన రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. చిత్తూరు జిల్లా మదనపల్లి ప్రాంతం నుంచి టమాట, కడప జిల్లా మైదుకూరు నుంచి పచ్చిమిర్చి, కీరాదోస మెదక్ జిల్లా నుంచి, బీట్‌రూట్, క్యారెట్ బెంగళూరు నుంచి, ఆలుగడ్డ ఉత్తరప్రదేశ్ నుంచి, ఉల్లిగడ్డ మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతం నుంచి దిగుమతి అవుతున్నాయి. హోల్‌సేల్ వ్యాపారులు ఆయా ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుని జిల్లాలోని రిటైల్ వ్యాపారులకు సరఫరా చేస్తున్నారు.

ధర పెరిగినా నాణ్యంగా లేవు



కూరగాయల్లో నాణ్యత లేదు. రుచిగా ఉండటం లేదు. పైగా ధరలు అందుబాటులో లేవు. ఏ కూరగాయ ధర చూసినా కొనలేని పరిస్థితి. టమాట రూ.110 పైమాటే. రైతుబజార్, కూరగాయల మార్కెట్లలో నిర్దేశించిన సమయాల్లోనే కూరగాయలు లభిస్తున్నాయి. అన్ని వేళల్లో లభించడం లేదు.
– సోమారపు సుధీర్‌కుమార్, ఖమ్మం

ధరలు భారంగా ఉన్నాయి



కూరగాయల ధరలు భారంగా మారాయి. పచ్చిమిర్చి ధర రూ.120 వరకు చెబుతున్నారు. టమాట అన్ని వేళల్లో లభించడం లేదు. రూ.100 పెట్టి కూరగాయలు కొంటే రెండు రోజులు మాత్రమే వస్తున్నాయి. దుంపల ధరలు కూడా భారీగానే పెరిగాయి.
– వెంకటేశ్వర్లు, ప్రకాష్‌నగర్, ఖమ్మం

అర్హులందరికీ ప్రమోషన్లు కల్పించాలి

- ఆశ్రమ పాఠశాలలను అభివృద్ధి చేయాలి
- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

భద్రాచలంఅర్బన్ : గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల్లో అర్హులందరికీ తక్షణమే పదోన్నతులు కల్పించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భద్రాచలంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో అత్యధిక మందికి విద్యనందిస్తున్న గిరిజన సంక్షేమ పాఠశాలలను గురుకులాలతో సమానంగా అభివృద్ధి చేయాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖకు ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె. జంగయ్య మాట్లాడుతూ.. పీఆర్సీ కమిటీ నియమించాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యా రంగం అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి మాట్లాడుతూ సీఆర్టీలకు బేసిక్ పే ఇవ్వాలని, గత పీఆర్సీ సిఫార్సు ప్రకారం అదనపు హెచ్ఆర్ఏ జీఓ తక్షణమే విడుదల చేయాలని అన్నారు. అనంతరం సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.రాజు సమస్యలపై తీర్మానాలను ప్రతిపాదించారు. యూటీఎఫ్ నాయకులు జి.వి.నాగమల్లేశ్వరరావు, బి.కిషోర్ సింగ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్ దుర్గాభవాని, రాష్ట్ర కార్యదర్శి సమ్మారావు, అటాక్ కమిటీ కన్వీనర్ ఎస్కే మహబూబ్ అలి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు, కృష్ణ, వరలక్ష్మి, మురళీమోహన్, వెంకటేశ్వర్లు, బి.రామదాసు, టి.బాలు, డి.తావుర్యా, ఎం.పద్మరాణి, బి. రాము, కె. సీతారామయ్య, ఎస్.విజయ్ కుమార్, బిక్కు, వాథిరాం, ఎం.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఖమ్మం సహకారనగర్ : విద్యార్థులను చదువు వైపు మరల్చేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఈ క్రమంలో ఈనెల 10 నుంచి 15 వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు కార్యక్రమ అమలుపై ప్రణాళిక రూపొందించినట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు.

- 10న పఠనం ప్రాముఖ్యతపై ఎవరైనా ప్రముఖ వ్యక్తిచే పిల్లలకు అవగాహన కల్పించాలి. వారితో పుస్తక పఠనం చేయించాలి. వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలో చేపట్టబోయే వివిధ కార్యక్రమాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలి.
- 11న పుస్తక పఠనం ఆవశ్యకత తెలియజేస్తూ గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించాలి. పుట్టిన రోజు లాంటి వివిధ సందర్భాలలో పిల్లలకు బహుమతిగా పుస్తకాలను అందజేయాలంటూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి.
- 12, 13 తేదీల్లో పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాల సేకరణ కార్యక్రమం చేపట్టాలి. దాతల నుంచి లేదా ఉపాధ్యాయుల ఇళ్లలో ఉండే వివిధ రకాల కథల పుస్తకాలు, వార్తాపత్రికల్లో పిల్లల పేజీల్లో ఉండే కథలు, బొమ్మలు వివిధ రకాల పజిల్స్ వంటివి సేకరించాలి. ఇవన్నీ పిల్లలకు అందుబాటులో ఉంచేలా చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలి.
- 14న పఠన సామగ్రి అభివృద్ధిలో భాగంగా విద్యార్థుల చేత పేపర్ కటింగ్స్, కార్టూన్లు, పజిల్స్, రీడింగ్ కార్డులను ఒక్కో పాఠశాలకు వంద చొప్పున స్వయం అభ్యసన సామగ్రి తయారు చేయించి అందుబాటులో ఉంచాలి.
- 15న తల్లిదండ్రుల సమావేశంలో పిల్లలచే పుస్తక పఠనం చేయించాలి. పిల్లలకు పఠన పోటీలు నిర్వహించాలి. కథలు చదివించడం, పుస్తక సమీక్ష, పిల్లలు సొంతంగా కథలు చెప్పటం వంటి అంశాల్లో పోటీలు నిర్వహించాలి. వేగంగా, తప్పులు లేకుండా చదవడంపై కూడా పోటీలు నిర్వహించాలి. ఈ కార్యక్రమాలన్నీ పూర్తయ్యాక డీఈఓ కార్యాలయంలో నివేదిక సమర్పించాలి.

కిన్నెరసానిలో పర్యాటకుల కోలాహలం

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించారు. అనంతరం బోటుషికారు చేశారు. 817 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.28,060 ఆదాయం లభించగా, 350 మంది బోటింగ్ చేయడం ద్వారా టూరిజం శాఖకు రూ.21,470 వచ్చాయని నిర్వాహకులు తెలిపారు.



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు